క్లుప్తంగా

9 నుంచి సీపీఎం సమావేశాలు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 9వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఏలూరులో తొలిసారిగా సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు, జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సులు నిర్వహిస్తున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, దాని మిత్ర పక్షాలను ఓడించడం, వామపక్ష శక్తుల ఐక్యత, సీపీఎం స్వతంత్ర విధానం, రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన ఎత్తుగడలు తదితర అంశాలపై లోతైన చర్చలు నిర్వహిస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీ, దానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా బలపర్చే రాజకీయ పార్టీలను ఓడించాలని పిలుపు నిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, నగర కార్యదర్శి పి.కిషోర్ పాల్గొన్నారు.

తపన చౌదరికి అస్వస్థత



కిమ్స్‌లో చికిత్స పొందుతున్న గారపాటి

ఏలూరు (టూటౌన్) : బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి కుడి కంటికి స్ట్రోక్ రావడంతో అస్వస్థతకు గురయ్యారు. హైదరాబాద్‌లోని ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యుల సూచనల మేరకు కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆయన కార్యాలయ పీఆర్‌ఓ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదడు నుంచి కుడి కంటికి వెళ్లే నాళంలో బ్లాక్ (గడ్డ) ఏర్పడటం వల్ల స్ట్రోక్ వచ్చిందని, ఈ నెల 10 నుంచి ఆయన ఏలూరులోని అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

గోసంరక్షణశాలను సందర్శించిన విద్యార్థులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలలో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు శ్రీవారి కొండపై ఉన్న గోసంరక్షణశాలను శుక్రవారం సందర్శించారు. సేంద్రియ వ్యవసాయంలో గోవుల పాత్ర, పంచగవ్య తయారీ, జీవామృతం ఎలా తయారు చేస్తారన్న విషయాలను ఉపాధ్యాయులు బుచ్చిరాజు, కాంతారావు, జానకీదేవిలు విద్యార్థులకు వివరించారు. అలాగే గోవులలో గిర్, కాంక్రేజ్, సాహివాల్, పుంగనూరు, కపిల, జెర్సీ తదితర జాతుల ఆవుల ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గోసంరక్షణశాల సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్ : ఏలూరు నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని, అభివృద్ధే లక్ష్యంగా శంకుస్థానలు, ప్రారంభోత్సవాలు చేపట్టామని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని చెప్పారు. ఏలూరు నగరంలోని 26, 35, 44, 45 డివిజన్ల పరిధిలో రూ.1.29 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆళ్ల నాని ప్రారంభోత్సవాలు చేశారు. మరో రూ.1.62 కోట్ల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి ఆయన నగర మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఏలూరు 45వ డివిజన్‌లోని పార్కులో ఓపెన్‌జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏలూరు నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమాన్ని అందించటంతోపాటు, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఏలూరు నగరంలోని ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు గతంలో ఎన్నడూ ఊహించని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మేలు చేసిందని వివరించారు. ఒకవైపు భారీ ఎత్తున పేదలకు సంక్షేమాన్ని అందిస్తూనే నగరాన్ని సుందరీకరణ చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నగరంలోని ప్రతి డివిజన్‌లోనూ ప్రజల అవసరాలకు అనుగుణంగా స్థానిక నేతల కోరిక మేరకు సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు, వీధి దీపాలు, నీటి కుళాయిలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమాల్లో నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, కో ఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఏలూరు 45వ డివిజన్‌లో పార్కులో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్, ఇడా చైర్మన్ శ్రీనివాస్



ఏలూరు 44వ డివిజన్‌లో సీసీ రోడ్డు శంకుస్థాపనలో ఎమ్మెల్యే నాని, మేయర్ నూర్జహాన్, ఇడా చైర్మన్ శ్రీనివాస్

నేడు సోషల్ మీడియా కన్వీనర్ల సమావేశం

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సోషల్ మీడియా ప్రతినిధులతో శనివారం ఉదయం 10. 30 గంటలకు స్థానిక కాంచనమాల కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. దెందులూరు నియోజకవర్గం, పార్టీ మండల సోషల్ మీడియా కన్వీనర్లు, కో కన్వీనర్లు, వారియర్స్ పాల్గొననున్నారు.

7న వంగూరు, లక్ష్మీపురంలో ఉచిత వైద్య శిబిరాలు

పెదవేగి : పెదవేగి మండలం వంగూరు, లక్ష్మీపురంలో ఆదివారం జ్యోతి రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని పాస్టర్ జ్యోతి రాజు తెలిపారు. వంగూరు, లక్ష్మీపురంలో ప్రాథమిక పాఠశాలలో ఉదయం 8 నుంచి మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామని, డెంగీ, బీపీ, సుగర్, థైరాయిడ్, విష జ్వరాలు, కీళ్లవాతం, కీళ్ల నొప్పులు, ఉబ్బసం, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. ఉచితంగా మందులు అందిస్తామని తెలిపారు. నిపుణులైన వైద్య బృందం సలహాలు అందిస్తారని పేర్కొన్నారు.

కొల్లేరు అభివృద్ధిని ఓర్వలేని పచ్చ నేతలు

- ప్రజా ఆశీర్వాద యాత్రలో ఎమ్మెల్యే కొఠారు
- రూ.8 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

ఏలూరు రూరల్ : కొల్లేరు గ్రామాల్లో అభివృద్ధి చూసి పచ్చనేతలు కళ్లు ఎరుపెక్కుతున్నాయని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఎద్దేవా చేశారు. మూడోరోజు శుక్రవారం కొల్లేరు గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రజా ఆశీర్వాదయాత్రకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. గుడివాకలంకలో పల్లెనిద్ర చేసిన ఎమ్మెల్యే ఉదయం నుంచి సాయంత్రం వరకు రూ.8 కోట్లతో పూర్తి చేసిన అభివృద్ధి పనులు ప్రారంభించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తూ.. కొత్త పింఛన్లు పంపిణీ చేశారు.

విద్యుత్ కష్టాలకు శాస్వత పరిష్కారం

గుడివాకలంకలో రూ.60 లక్షలతో కట్టిన ఓవర్‌హెడ్ ట్యాంక్, రూ.80 లక్షలతో అభివృద్ధి చేసిన సీసీ రోడ్లు, నాడు నేడు ఫేజ్-2లో భాగంగా రూ.1 కోటీ 95 లక్షలతో జెడ్పీ పాఠశాలలో చేపట్టిన అదనపు తరగతి గదుల పనులకు శంకుస్థాపన చేశారు. రూ.4.60 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ సమస్యలతో కొల్లేరు ప్రజలు నానా అగచాట్లు పడ్డారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించి విద్యుత్ కష్టాలకు శాస్వత పరిష్కారం చూపామని తెలిపారు. కొల్లేరు గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేస్తున్నామని జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కొనియాడారు.

కోటేశ్వరదుర్గాపురంలో..

గుడివాకలంక నుంచి పాదయాత్రగా మాదవాపురం చేరుకున్నారు. రూ.25 లక్షల రూర్బన్ నిధులతో నిర్మించిన 40 వేల లీటర్ల ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను సర్పంచ్ వర్రి లక్ష్మీదుర్గ, ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు జి.బాలుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. తర్వాత కోటేశ్వరదుర్గాపురంలో రూ.38 లక్షలతో నిర్మించిన సచివాలయం భవనం, మరో రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ క్లినిక్, రూ.13 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించిన రెండు కల్వర్టులు, గ్రావెల్ రోడ్లు, రూ.79.2 లక్షలతో అభివృద్ధి చేసిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అక్కడ నుంచి తిమ్మారావుగూడెంలో సుమారు రూ.10 లక్షలతో పూర్తి చేసిన కల్వర్ట్, గ్రావెల్ రోడ్డును ప్రారంభించారు. అక్కడ నుంచి చాటపర్రు చేరుకుని పల్లె నిద్ర చేసి, ఉదయం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడతారు. జెడ్పీటీసీ మండల సరస్వతి, ఏఎంసీ చైర్మన్ అప్పన్న ప్రసాద్, వడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ మండల కొండలరావు, మాజీ ఎంపీపీ జయమంగళ రామారావు, పార్టీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్, ఉపసర్పంచ్ జి.రుక్మనంద్‌మహరాజ్, ఎంపీటీసీలు మోరు రజని, బోడిగడ్డ శ్రీనివాస్‌కుమారి, మండలపరిషత్, ట్రాన్స్‌కో, అటవీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



మాదవాపురంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొఠారు



సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు



గుడివాకలంకలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ప్రారంభించిన సబ్‌స్టేషన్

భక్తిశ్రద్ధలతో త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించి అనంతరం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ, స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయంలో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. సాయంత్రం నగరానికి చెందిన మంతెన హరీష్ కుమార్ భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి శ్రీనివాస మంగాపురంలోని వశిష్ఠాశ్రమ శ్రీ లలితా పీఠాధిపతి శ్రీ స్వరూపానందగిరి స్వామి సాధన పంచకం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి నగరానికి చెందిన అభినయ నృత్య భారతి సంస్థ ఆధ్వర్యంలో నాట్యాచార్య డి.హేమ సుందర్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి.





వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు, కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

ఉద్యాన విద్యార్థినుల పర్యటన

పెదవేగి : కొండలరావుపాలెంలో గురువారం ఉద్యాన విద్యార్థులు గ్రామీణ భాగస్వామ్య అంశంపై విశ్లేషణాత్మక సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ పటం, వెన్, టైంలైన్ చిత్రాలు చిత్రీకరించారు. వీటి ద్వారా సాగు వివరాలు, పాఠశాలలు, దేవాలయాలు సహజ వనరులు, ఆర్‌బీకే కేంద్రం, గ్రామ మండల, జిల్లా ప్రభుత్వ కార్యాలయాలు, వాటి ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలడుగు సత్యవతి, గ్రామ ఉద్యాన అధికారి సీహెచ్ భాగ్య ఫణీంద్ర, రైతులు, వెంకటరామన్నగూడెం విద్యార్థినులు ఎ గౌతమి, ఆకాంక్ష సింగ్, ఎ గీతస్నేహ, ఎ షాలిని, సీహెచ్ అశ్మిత, ఎస్ చంద్రకళ, సీహెచ్ కీర్తనలు పాల్గొన్నారు.

టార్పాలిన్ల పంపిణీ

దెందులూరు: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సిటీ కోఆర్డినేటర్ బలే సురేష్ శింగవరంలో 15 గిరిజన కుటుంబాలకు టార్పాలిన్లు అందజేయడం అభినందనీయమని కొత్తగూడెం సర్పంచ్ పరసా లక్ష్మీ సుజాత, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్ అన్నారు. శుక్రవారం శింగవరంలో బలే సురేష్ ఆధ్వర్యంలో 15 మంది గిరిజనులకు టార్పాలిన్లు, వారి పిల్లలకు ఔట్‌డోర్ లెర్నింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), కనకరాజు, ఉమెన్ కానిస్టేబుల్ శిరీషా, ఉజ్వల్ ఉన్నారు.

వడ్రంగి పనివార్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు (టూటౌన్) : ఏలూరు నియోజకవర్గంలోని వడ్రంగి పనివార్ల సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని ఎమ్మెల్యే ఆళ్ల నాని హామీ ఇచ్చారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో వడ్రంగి సంక్షేమ సంఘం నాయకులు బీసీ సెల్ ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలచారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఇటీవల ఎన్నికైన వడ్రంగి సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యే నానికి పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువాతో సత్కరించారు. తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని నానికి అందించారు. పవరుపేటలోని సంఘం భవనం పైకప్పు ఏర్పాటుకు నిధులు సమకూర్చాలని, శనివారపుపేటలో రుద్రభూమికి ప్రహరీ, బోరు, విశ్వబ్రాహ్మణుల అపర కర్మలకు స్థలం, భవనం కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సమస్యలను పరిశీలించి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని నాని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్పెంటర్ అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే నాని, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబుల చేతులు మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వడ్రంగి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాట్నూరి శివరావు, ప్రధాన కార్యదర్శి కెల్లా దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు కొత్తల శివ, అద్దంకి సత్యనారాయణ, పెద్ద సంఖ్యలో సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నానిని కలిసిన వడ్రంగి సంక్షేమ సంఘం నాయకులు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	28	బీట్లచిక్కుడు	76
వంకాయలు (తెలుపు)	--	చామదుంపలు	56
బెండకాయలు	54	ములక్కాడలు	10-15
పచ్చిమిర్చి	42	కంద	56
కాకర కాయలు	64	బీట్‌రూట్	36
బీరకాయలు	--	కీర దోస	30
బీరకాయలు (పందిరి)	64	ఫ్రెంచ్‌బీన్స్	72
క్యాబేజీ	24	అల్లం	120
క్యారెట్	44-54	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	36	పాలకూర	12
బంగాళదుంపలు	26	చుక్కకూర	12
ఉల్లిపాయలు	25-30	తోటకూర	12
గోరుచిక్కుడు	56	గోంగూర	08
దోసకాయలు	34-48	పుదీనా	05
ఆనబకాయ (1)	30-35	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	25
ద్వారకాతిరుమల -ఏలూరు- బీహెచ్‌ఈఎల్	22.15	4822	19
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	37
ఏలూరు -తిరుపతి	16.00	4830	25

జేఎన్‌టీయూకే హ్యాండ్ బాల్ మహిళల జట్టుకు శిక్షణ

దెందులూరు: ప్రతిభ, నిరంతర సాధన, ఆసక్తి, విజయానికి ఏకైక మార్గమని హేలాపురి ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అట్లూరి శ్రీనివాసరావు, ఏఓ టీఎస్ కరుణానిధి అన్నారు. శుక్రవారం గోపన్నపాలెంలో హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలలో వారు మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు పెరియల్ యూనివర్సిటీ సాలెం తమిళనాడులో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారని తెలిపారు.దీనికి సంబంధించి కళాశాలలో జేఎన్‌టీయూకే హ్యాండ్‌బాల్ మహిళల జట్టుకు శిక్షణనిస్తున్నట్టు తెలిపారు. ఏఓ కరుణానిధి క్రీడాకారులకు పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, క్రీడాకారులు ఉన్నారు.

కబడ్డీ పోటీలు

దెందులూరు: ఆడుదాం ఆంధ్రలో భాగంగా శుక్రవారం గోపన్నపాలెంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. గోపన్నపాలెం, సోమవరప్పాడు, సానిగూడెం టీమ్‌లు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. తొలుత పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ ఎం.మనోహర్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పార్థసారథి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

దెందులూరు: వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై బుధవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈవీఎం మిషన్లను తీసుకువచ్చి ప్రజలకు ఓటు హక్కు నమోదు, బ్యాలెట్ పేపర్ వినియోగంపై డమ్మీ బ్యాలెట్ పేపర్లతో అవగాహన కల్పించారు. తహసీల్దార్ ప్రజలకు పలు సూచనలను చేశారు.

ఎన్నికల హామీలన్నీ నెరవేర్చిన సీఎం జగన్

పెదపాడు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంచెలంచెలుగా సామాజిక భద్రతా పింఛను రూ.3వేలు అందిస్తామని ఇచ్చిన మాటను నెరవేర్చారని రాష్ట్ర వడ్డి కార్పొరేషన్ డైరక్టరు ఘంటసాల ప్రభాకరరావు తెలిపారు. పెదపాడు మండలంలోని గుడిపాడులో శుక్రవారం సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు ఘంటసాల రామ్మోహనరావు పాల్గొన్నారు.

పెదవేగి మండలంలో..

పెదవేగి : ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుని ప్రజల్లో గుండెల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొలువయ్యారని బాపిరాజుగూడెం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వీరమాచినేని నాగబాబు అన్నారు. పెంచిన పింఛన్ నగదును రూ.3 వేలను స్థానిక నాయకులు, వలంటీర్ల సమక్షంలో నాగబాబు లబ్ధిదారులకు అందించారు. నడిపల్లిలో సచివాలయ కన్వీనర్లు గృహసారథుల ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుంచి పెరిగిన నగదు రూ.3 వేలు పింఛన్ లబ్ధిదారులకు అందజేశారు. పింఛన్ అందుకున్న లబ్ధిదారులు ఆనందంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు ఊక్కుర్తి నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ మద్దాల రాజేశ్వరి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జి స్టాలిన్, మద్దాల గోపాలరావు, యాదవ సంఘం ప్రెసిడెంట్ గొడ్డాటి తాతారావు పింగళి, యాకోబు వెంట్రుపాటి మహేష్, వలంటీర్లు, గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.